దీపావళి కథల పోటీలో రూ.500 బహుమతి పొందిన కథ

# ఎండుచేపలు



నాయని కృష్ణకుమారి

కారు ఆగిపోయింది. ఇక ముందుకు కదలడానికి లేదు. ఇరుకు సందులో అటూ ఇటూ దుకాణాల వరసలు, అగ్గిపెట్టెల్తో చేసిన రైలుబళ్ళలా కనిపిస్తున్నాయ్. ఎత్తుగా ఉన్న బల్లల మధ్యన ముడిగ్గా దుకాణాదారులు కూర్చుని ఉన్నారు. వాళ్ళముందు గల్లా పెట్టెలున్నయ్. ఆ పెట్టెల కటూ ఇటూ తాటాకులు పేర్చి సట్లో ఎండుచేపలు పనలు పనలుగా అమర్చి ఉన్నయ్. ఆ చేపలకూ, గల్లా పెట్టెల్లో పడే డబ్బుకూ ప్రత్యక్షంగా ఎటువంటి సంబంధమూ లేదు. అవి ఒకటి కొకటి, ఏ చిక్కు క్షణాల్లోనూ ఆసరాగా నిలబడవు. కాని గల్లాపెట్టెల్లో డబ్బు చేరాలంటే ఆ ఎండుచేపలు అక్కడుండక తప్పదు. అవి లేకపోతే పెట్టెలు ఖాళీగానే ఉంటాయి.

కారులోంచి ఇద్దరాడమనుషులు దిగారు. ఇద్దరూ సన్నగా, చురుగ్గా ఉన్నారు. ఆ యిరుకు సందు దాటి అవతలవైపున్న కూరగాయలు కొనుక్కోడానికి వెళ్తున్నారు. ఊరు మొత్తంమీద అక్కడే చౌగ్గా నవనవలాడుతూ అన్నిరకాల కూరగాయలూ దొరుకుతాయని ప్రతీతి. అవి కొని తీరుతీరులుగా, వండి, వడ్డించి, తమకైన వాళ్ళ కడుపులు నింపడమే ఆ క్షణాన వాళ్ళ జీవిత పరమార్థం. అందుకని వాళ్ళ దృష్టంతా దూరంగా, కనపడని కాయగూరల్ని వెతుకుతోందే కానీ, ఎదురుగా కనిపించే ఎండుచేపల్ని గమనించలేదు.

'అబ్బ! ఏం మండిపోతున్నాయండీ కూరలు!' ఒకావిడన్నది.

'మరే! మన కూరలమ్మి తెచ్చే సరుకు నోట పెట్టే పనే లేదు. ఏ పూట కాపూట రూపాయ చెల్లుతుంది కానీ, చట్టినిండనా కడుపు నిండనా?'

'దాన్ది మరీ అన్యాయం లెండి. చచ్చిపోయినయ్యా, పుచ్చిపోయినయ్యా, వాళ్ళూ వాళ్ళూ పారేసినయ్యన్నీ ఏరుకొచ్చే బాపతు. అవే మన దగ్గరకొచ్చి మండించేస్తది.'

'ఇక్కడ బోలెడు చౌకంట. ఈ అలగా జనం గంపలు గంపలు, రూపాయకూ రెండుకూ, కొని మనదగ్గర లాభాలు పోసుకు పోతారు.'

'మరి మనమేగా వీళ్ళకు తేరగా దొరికేది! వీళ్ళకూ మనవే గవర్నమెంటుకూ మనవే.'

అట్లా దారెంట పోతూనే వాళ్లెన్నో మాట్లాడుకున్నారు. కూరగాయలమ్మే వాళ్ళ నిరంకుశత్వాన్ని ఖండించారు. వాళ్ళు తమలాంటి వాళ్ళను దోచే దోపిడీ విధానాన్ని నిరసించారు. ప్రభుత్వమే సహకార శాఖలు స్థాపించి, కూరగాయలు చౌగ్గా సరఫరా చెయ్యకూడదా అనుకున్నారు. ఇందిరమ్మ ఏవేవో పెద్ద మాటలు చెబుతుంది గానీ ఇటువంటి అవసరమైన మార్పులు తేవద్దా అంటూ వాళ్ళ వాళ్ళ మగవాళ్ళు. ఏమీ తోచనప్పుడు మాట్లాడుకునే చిలకపలుకులు అక్కడ వల్లించుకున్నారు. చివరకు కూరలమ్మే వాళ్ళ బుట్టలో పడకుండా చౌగ్గా కాయగూరలు కొనుక్కుపోడానికని బయలుదేరిన

తమ తెలివిని అభినందించుకుంటూ చకచకా నడుస్తున్నారు.

ఆ నడకలో కనీ కనపడని ఒయ్యారముంది. అహముంది. దగ్గరున్న డబ్బు తమచుట్టూ అల్లిన ఆత్మ విశ్వాసమనే బలమైన రక్షణవలయముంది. వాళ్ళిద్దరూ, చౌగ్గా కాయగూరలు కొనుక్కోడానికి మైళ్ళకు మైళ్ళు కారేసుకుని రాగలిగినంత ధనవంతులు.

వాళ్ళ కూరలమ్మ కూడా ఇట్లాగే చకచకా నడుస్తుంది. కాని ఆ నడకలో ఒయ్యారం బదులు ఒకటే తొందర! ఆవిడ చాలా పొట్టి మనిషి. సన్నటి శరీరం. తిండి తక్కువై చిక్కిపోయిన కడుపు. అందులో కనపడని మంటలు! తానీడుస్తున్న జీవితపు బరువు తగ్గడానికి ఎక్కడ కొంచెం సులువు చిక్కుతుందా అని వెతికి వెతికి గాజువారిన కళ్ళు! పని ముగించుకుని తొందరగా ఇల్లు చేరాలనే తపన. వచ్చే డబ్బుల్తో తన వాళ్ళ కడుపుని నింపాలి. తాను తినాలి. అదే యావ! ఏ ఆసరా లేదని తెలిసీ, ఒంటరిగా నట్టడవిలో దారి వెతుక్కుంటున్నదానిలా తత్తరపాటుతో నడుస్తుందా మనిషి. మైళ్ళకు మైళ్ళు గంప నెత్తి నెత్తుకుని కాలినడకన తిరిగితే తప్ప కడుపు నిండనంత బీదమనిషి ఆవిడ!

ఇద్దరాడమనుషులూ, కూరగాయలమండీ మధ్యకు వచ్చేశారు. మండీ విశాలంగా ఉంది. అన్నీ పెద్ద పెద్ద పాకలు. ఒక్కోచోట ఒక్కోరకం కూరగాయలు కుప్పలు పడి ఉన్నయ్, ఎక్కడ చూసినా ఒకటే జనం. వాన పడ్డప్పుడు గుంటల్లో నిలిచిపోయే నీటికిమల్లే ఎక్కడంటే అక్కడ పోగులు పడుతున్న జనం. వాళ్ళు అరుస్తున్నారు. చేతులు తిప్పుతున్నారు. ఒక చోటు నుంచి మరోచోటుకు కదులుతున్నారు. వాతావరణమంతా చిత్రమైన మనిషి వాసనతో నిండిపోయింది. ఇంత మంది మధ్య ఎంత భద్రత! తాము అడవిలో లేనట్లు క్రూరమృగాల మధ్య కారాడనట్లు, కనపడని భూతాల బారిన పడడానికి వీలులేనట్లు తమ చుట్టూ దట్టంగా కమ్ముకుంటూ నమ్మకాన్ని కలిగించే కమ్మటి వాసన. ఎదుటి మనిషి గుండెల్లో మనుషులమీద మమకారాన్ని పెంచే మెతక వాసన!

ఇద్దరికీ ఆ వాతావరణం వింతగా ఉంది. నరాల్లో ఓ రకమైన సన్నని ఉత్తేజాన్ని కలిగిస్తోంది. ఇక్కడ కూరగాయలు కారుచౌగ్గా కొని, ఇళ్ళదగ్గర మగవాళ్ళు తమ ఘనకార్యాన్ని మెచ్చుకునేట్లు చాటాలి. వాళ్ళకదే ధ్యాస!

వాళ్ళచుట్టూ కాయగూరలు కుప్పలు పడి ఉన్నయ్. ఎవరెవరో మనుషులు బస్తాలకు బస్తాలు తెచ్చి పోగులు పోసి పోతున్నారు. ప్రతి పోగు వెనకా ఓ ఆసామీ ఉన్నాడు.

సరిగ్గా ఆ యిద్దరూ నిలుచున్నచోటికి దగ్గరగా ఓ సొరకాయలగుట్ట పడ్డది. ఎవరో ఒకతను, అప్పుడే ఆ కాయల్ని గుమ్మరించాడు. గుమ్మరించిన తలకు చుట్టుకున్న గుడ్డతీసి మొహాన పట్టిన చెమటను అద్దుకున్నాడు. వాడిచూపులు, కింద గుట్టగా పడ్డకాయల్ని వదిలి రావడం లేదు. వాడికళ్ళల్లో మెరుపులేదు. వాడి కడుపు పీక్కుడొక్కలు డోలుమంటూ ఉంది. కాయలన్నీ గుండ్రంగా నవనవలాడుతూ పాలూ అన్నం తినేవాళ్ళ కడుపుల్లాగా మెరుస్తున్నయ్. వాటివెనక కూర్చున్న ఆసామీ కడుపుకూడా గుండ్రంగా ఉంది. అతని కళ్ళకింది కండలు ఉబ్బి. ఊరిన చెంపల్తో కలిసి, మొహంకూడా ఒక సన్నటి సొరకాయలాగే ఉంది. ఆ కళ్ళు, కండలవల్ల సగం మూసుకుపోయి, మెరుస్తున్నాయో మత్తుగా ఉన్నాయో తెలీడంలేదు. కాయలమ్మినవాడు, ఆసామీ యిచ్చిన డబ్బు లెక్కపెట్టుకున్నాడు. వేళ్ళు మడిచాడు. తెరిచాడు. లోలోపల గొణుక్కున్నాడు. పెదాలచివర తృప్తివల్ల ఏర్పడే రేఖలు లేవు. ముఖంలో వెలుగులేదు. అయినా వాడు నోరువిప్పి ఆసామీతో ఒక్కమాటా ఆడలేదు. చేసుకున్నవాడికి చేసుకున్నంత అన్న కర్మభూమిలో పుట్టిన అతి సామాన్యప్రాణి వాడు. వాడు పెదవి విప్పడు. ఆసామీని ఏమీ అనడు. వాడు వెళ్ళిపోయింతర్వాత, ఆసామీ మీది కండువాతీసి, ఒక్కసారి బలంకొద్దీ దులిపి మళ్ళీ వేసుకున్నాడు లేచి నిలబడి, గట్టిగా అరవడం మొదలుపెట్టాడు.

'రూపాయి ఆరణాలకు రెండు—రూపాయి ఆరణాలకు రెండు!'—వాడిచుట్టూ జనం పోగవుతున్నారు. కూరగాయలమ్మకోవాల్సిన ఆడమనుషులు గంపలమీద గంపల పేరుస్తూ అనువైన చోటుకోసం తొక్కిసలాడుకుంటున్నారు.

ఆ యిద్దరాడవాళ్ళకూ సొరకాయల దరిదాపుకు పోవడానిక్కూడా సందు లేదు.

ఆ సమయంలో దూకుడుగా వచ్చింది రత్తమ్మ. రత్తమ్మ సన్నటిమనిషి. అటూ ఇటూ రెక్కలొలిచేసిన ఈనెపుల్లలా ఉంది. ఆవిడ కళ్ళల్లో కసి ఉంది. ఆవిడ చేతుల ఊపులో గాలివాన లక్షణాలున్నయ్. ఆవిడలో భయం ఏకోశానా లేదు, రత్తమ్మ తనదారికడ్డంగా ఉన్న వాళ్ళను మోచేతుల్తో పొడిచి తోసేసింది. జలగర్భాన్ని సర్రున చీల్చుకుని ముందుకు దూసుకుపోయే కత్తిపడవకుమల్లే, సరాసరి కాయల ముందుకు, ఆసామీ ఎదుటికివచ్చి, నిటారుగా నిలబడ్డది.

'ఏందీ, నాగయ్యో! రూపాయారణాలకు రెండా! కాయలమ్ముతున్నావా, బంగారమమ్ముతున్నావా!' అని అరచింది. నాగయ్యకు వెంటనే ఏమనాలో తట్టలేదు. గుడ్లప్పగించి చూస్తున్నాడు.

'నీ ఆశ మండిపోను! నీకాయలమ్మినోడు నేనెరిగినోడే! ఆడిదగ్గర వంద పాతిక్కి పడేసుకున్నావంటగా! ఆకాడికి నీకు గిట్టే లాభమెంత? మరీ అంత లాభవా? మరో ధర చెప్పు!'— గట్టిగా అరిచింది రత్తమ్మ. చుట్టూ ఉన్న సముద్రపు హోరులాంటి జనం గోలను, ఆ అరుపు మింగేసింది.

రత్తమ్మ అక్కడి జనానికి కొత్తగాదు. నాగయ్యకు దూరపు చుట్టం. బతికి చెడ్డమనిషి. బాగున్న రోజుల్లో ఆవిణ్ణి నాగయ్యే చేసుకుంటాడనుకునేవాళ్ళు. అందుకనేనేమో, ఆవిడకు నాగయ్య మీద హక్కుందనే అందరూ నమ్ముతుంటారు. నాగయ్యకు రత్తమంటే ఏ మూలనో భయం. ఆవిడ చెప్పే మాటల్లో దాగి ఉండే కటిక సత్యాలే అతన్ని బెదరగొట్టేవి. అతను రత్తమ్మకంటే, రత్తమ్మ నలుగురూ వినేట్టు అరిచే మాటలకు జడిసి పోతుంటాడు.

'ఇదో నడమంతపు మనిషి పోగయిం

## పెళ్లినాడు వధువుకు ప్రేమతో ఇచ్చే కానుక...



## జీవితపర్యంతంసంతోషమివ్వగల ఉషా కుట్టుమెషిన్

పెళ్లి కానుకలలో ఉషా కుట్టు మెషిన్‌వలె జీవిత పర్యంతం సంతోషమివ్వగలిగేది మరొక్కటి ఏదీ లేదు.

చేతితోను, కాలితోను నడిపేవి, విద్యుచ్ఛక్తితో నడిచేది—ఏ ఇంటికి ఆ యింటికే తగ్గట్టు అనేక రంగులలోను, అనేక నమూనాలలోను ఉషా కుట్టు మెషీన్‌లు కలవు. ప్రతి కుట్టు మెషీన్‌కు అమ్మకం తర్వాత సర్వీసు నిర్వహించే సౌకర్యం ఇండియాలో ఏ ప్రాంతంలోనైనా కలదు. ఇంటిలోనే ఉషా కుట్టు మెషీన్ పై కుట్టుపనిని నిర్వహించుకోవటం ఎంత లాభదాయకమో, మరెంతగా ఆనందదాయకమో తెలుసుకొనే అవకాశం నూతన వధువుకు కలిగించండి. నేడే ఒక దానిని, కొనండి!



ధరలు—రు. 180/- నుండి గలవు.
సులభమైన వాయిదాల పద్ధతిలో కూడా దొరకును

ఉషా నే కొనుక్కోండి—దాన్ని మించినదీ లేదు.

GRANT US. 1.73 TEL.


# ఎండు చేపలు

దయ్యా నా ప్రాణానికి!' అని బెంబేలుపడి తోటివాళ్ళ సానుభూతికోసం వెంపరలాడి పోతుంటాడు.

'ఇయ్యాళ బంగారమంటి బేరం చెడ గొట్టేట్టుంది. ఎండలు మండిపోతున్నయ్. నచ్చటి కూరలకు మొహంవాసిన జనం ఎంతైనా పెట్టి కొంటారు. దీన్మూలంగ నా దెగ్గ ధర దిగలాగుతుందో ఏమో!' అనుకున్నాడు. అయినా ఒక్క ఆడది, తన్నిట్టా లొక్కిం చడమేమిటి ? రోషం పొడుచుకొచ్చింది.

'ఏందే నీ సోది ? నేను కాయ పైసా క్కొంటాను. నా యిష్టమొచ్చినట్లమ్ము తాను. అదిక్కడ రూలే! అందరూ అదే జేస్తున్నారు. నీకాడ డబ్బులుంటే నువ్వూ అట్లాగే జేస్కో'—సవాలు చేశాడు నాగయ్య.

'డబ్బులు! అయి లేకేగా మీ ఆటలు చెల్లిచ్చుకుంటున్నారూ! నీ యెదాన అంతంత పోసి మేం గంపలెత్తుకుని ఊసురోమంటూ ఇల్లిల్లూ తిరగాలా ? ఇంతా కష్టపడితే మాకు మిగిలేయి కాలి కష్టమూ, ఇడి పైసలూ! ఒక్కో అమ్మ గీసి గీసి బేరం చేసిందంటే అయి కూడా మిగలవు. నువ్వు నీడపట్టున గూచునే ఒక్క మనుషుల కష్టం సొమ్ము అప్పనంగా వడేసుకు తింటావా ? ఇదంతా డబ్బుందనేగా! అసలు నీ దగ్గరంత డబ్బెందుకుండాలి ? అడిగే నాయాళ్లెవరూ కనపడక పోబట్టేగా!' రత్తమ్మ రెచ్చిపోతోంది. చుట్టూ గంపలు పెట్టుకుని నిల్చున్న ఆడమనుషులు రత్తమ్మ వేపు ఆరాధనతో చూస్తున్నారు. వాళ్ళలాగే వాళ్ళ గంపలు కూడా నోళ్ళు తెరుచుకుని వింటున్నయ్.

'సెబాస్ రత్తమ్మా, మా మనసులో మాట, మే మెన్నటికీ చెప్పలేని మాట చెపుతున్నావ్' అనుకుంటున్నారు వాళ్ళు.

నాగయ్య కళ్ళల్లో కోపం చేరింది. కళ్ళ చుట్టూ ఉన్న ఉబికిన కండరాలు పక్కకు జారి కళ్ళు పూర్తిగా తెరుచుకున్నయ్. వాటిల్లో ఇప్పుడు ముమ్మరమైన కోపంతో పాటు సన్నగా భయం కూడా కదులు తున్నట్లు తెలుస్తోంది.

'అయితే ఏంది నువ్వనేది ? నన్నియ్యాళ కాయలమ్ముకో నియ్యవా ?' గొంతు గాటిగా పలికింది. స్వరంలో కోపం మోగుతోంది. మనిషి ఊగుతున్నాడు.


'అయ్యో ! ఎందుకమ్ముకోనియ్యనూ !


నీకు డబ్బుంది గాబట్టి మారాయనరగా లాభం మిగుల్చుకో! పేదోళ్ళను దోచుకు తింటానంటే ఊరు ఊరుకోదు.'

'ఏదే ఊరు! ఊరు ఊరంతా పగిలబడి మా దగ్గరే కొంటూ ఉంది. ఊరుకోకేం చేస్తది? నా దగ్గరికి కార్డు మీద వస్తారు జనం!'

'వస్తారొస్తారు. మేం మిగిలిచ్చుకుంటున్న లాభాల్తో డాబాలేస్తున్నామనీ, కళ్లు దిరిగొస్తున్నారు.ఇదుగో నాగయ్యా ఎవరెట్టా పోయినా నే మారుకునేది లేదు. అయ్యా! నువ్వు ధర దిగ్గియ్యాల్సిందే జాగర్త!' శివమెత్తినదాన్లా అరిచింది రత్తమ్మ. అరుస్తూనే అంతటితో ఊరుకోకుండా నాగయ్య మీద ఎటువంటి చర్య తీసుకోవా






## ఎండు చేపలు

లనుకుందో ఏమో ఒక్క అడుగు ముందుకు వేసింది. వేసిన అడుగు పక్కనున్న మన్నుటి సొరకాయమీద పడడమేమిటి, కాలు జారిపడ్డ రత్తమ్మ నిలువునా పడిపోవడమేమిటి రెప్పపాటులో జరిగింది. రత్తమ్మ తల, పక్కనున్న కట్టాలకి తగిలి నేలమీద రక్తం చిందింది. సానుభూతి చూపించేదానికి తత్తరపడి చేరుతున్నట్టుగా, సొరకాయలు దొర్లుకుంటూ కిందపడ్డ మనిషి చుట్టూ చేరినయ్.

ఏం జరిగిందో అర్థంకాని నాగయ్య నిలువుగుడ్లేసుకుని చూస్తూ ఉండిపోయాడు. చుట్టూ ఉన్న జనం కెరటాల్లా వెళ్లిపోతున్నారు. నేలమీద పాకుతున్న రక్తం అందరివేపూ ఎర్రగా చూస్తోంది. రత్తమ్మపడ్డ తీరుకు పొట్టమీదున్న గుడ్డ కొద్దిగా తొలిగింది. తిండిలేక చిక్కిన కడుపు, చుట్టూ మూగిన జనానికి జరిగిన కథకు మూలమేమిటో చెప్తున్నట్టుగా ఉంది.

దగ్గరే ఉన్న ఇద్దరాడవాళ్ళకూ కాళ్ళు ఒణుకుతున్నయ్. కళ్ళల్లో నీటిపొరలు. మనసునిండా దిగులుతెరలు. వాటిమధ్య, రత్తమ్మ చిక్కిన కడుపూ, దానిచుట్టూ చేరిన నాగయ్య కడుపులాంటి మన్నుటి సొరకాయలూ, కదలాడసాగాయి.

వాళ్ళిద్దరూ, పూర్తిగా బెదిరిపోయారు.

భయంతో గుండె దడదడలాడుతుండగా, ఎంతవేగంతో నడిచారో వాళ్ళకే తెలీదు. ఈసారి వాళ్ళకు ఇరుకు సందులో అటూ ఇటూ దుకాణాలమీద ఎండుచేపలు భూతద్దంలో చూచినట్టుగా కనిపిస్తున్నయ్. అంతేకాదు, వాటి స్థానంలో కూరగాయల తట్టలెత్తుకుని ఇళ్ళిళ్ళా తిరిగే ఎండుచేపల్లాంటి మనుషులు కట్టల్లా మార్చి మార్చి కనపడసాగారు. వాళ్ళు నేలమీద తాపీగా జరుగుతున్న రత్తమ్మ రక్తంలాగా, మెరుస్తూ, ఎర్రగా మండిపోతున్నట్టున్నారు.

అప్పటినుంచి ఆ యిద్దరూ మళ్ళీ చౌగ్గా కాయగూరలు కొందామని కాదేసుకుని బయలుదేరలేదు. ఇంటికి తట్ట లెత్తుకొచ్చిన మనుషుల్తో గీచి గీచి బేరాలు చెప్పలేదు